ఐకమత్యం

# సంగీత చికిత్స

అవసరాల రామకృష్ణారావు

మా యింట్లో పెద్ద వాటాలో నల్భై రూపా యలకు అద్దెకు వున్న స్కూలు మేష్టరు గారికి మరో వూర్లో పనై వాటా ఖాళీ చేసి వెళ్లి పోయారు. పదిరోజులపాటు మాయిల్లు ఊరికే వుంది. అసలు మా లక్ష్మితో ఎవరూ పడ లేరు. మేష్టారి పెళ్లాం మహాయిల్లాలు కాబట్టి మా ఆవిడతో ఎలాగో వెళ్లబుచ్చింది. ఎవరు దిగుతారో, ఏం గొడవ జరుగుతుందో అని భయ పడుతూనే వున్నాను. మహా గడుపుకనీ దాని లాగ లక్ష్మి నా దగ్గర కొచ్చి 'ఏమండీ, యింత యిల్లూ నల్భైకి యివ్వడం నాకేం నచ్చలేదు, వాటాలుచేసి చెరో పాతిక చొప్పునా యిద్దాం' అంది. నే నేమేనా అంటే నామీద ఎగురుతుం దని "అలాగే" అన్నాను. ఆ తరువాత నాలుగు రోజులకి మా వాటాకి చెరో పక్కనీ సంగీతం మేష్టరూ, వకీలుగారూ దిగేరు.

మా లక్ష్మికి పాట బాగా వచ్చునని ఓ అహంభావం. నా పెళ్ళి చూపులకి వెళ్లిననాడు 'అమ్మాయి మా బాగా పాడుతుంది' అంటే నిజమే అనుకున్నాను. పెళ్లిలో పాడమంటే సిగ్గన్నారు. ఆఖరికి ఓనాడు మురిపించుకు, మురి పించుకుని గొంతుక సవరించుకొని 'ఆహా, ఏమీ నా భాగ్యము స్వామి కరుణించెన్' అని మొద లెట్టింది. ఆ ముక్క అయిందో లేదో అక్క డున్న ఆడాళ్లూ మొగాళ్లూ అందరూ ఘొల్లున నవ్వేరు. వాళ్లమ్మ చిన్న బుచ్చుకొని "అదేమిటే! సినిమాపాట పాడూ!" అంది. లక్ష్మి ఆఖాయ మిలాఖే వరుసలో "భరింపజాలమూ బ్లాకు మార్కెట్టూ, భారతీయులారా, ఓ భారతీయు లారా!" అని అందుకుంది. నవ్వు ఆపుకోలేక పిల్లలు పకపక నవ్వేశారు. లక్ష్మి ఆ నవ్వులేమీ లెక్క చెయ్యకుండా పాట సాగించింది. నవ్వు మాట దేవు డెరుగునుగాని నాకక్కడ కూర్చో డం కష్ట మనిపించింది. ఆ తరవాత ఎవరూ పాడ మనకుండానే "బాబా, బహు పేదలము..." గంటసేపు పాడింది. మా అక్కయ్య యింక భరించలేక "మంగళహారతి పాడెయ్యి, మర దలా!" అంది. ఇంతకీ చెప్పొచ్చే దేమిటంటే మా లక్ష్మి పాడితే కాకి అరిచినట్టూ, పిల్లా డేడిచినట్టూ వుంటుంది. తనపాట బాగులేదని గాని, యింకోళ్ళపాట బాగుందనిగాని మా లక్ష్మి దగ్గిర అనడానికి వీలులేదు.

అవతల సంగీతం మేష్టారూ, యివతల వకీలు గారి భార్య పంకజం చాలా బాగా పాడే తారు. లక్ష్మి నాదగ్గిర కొచ్చి "యీ వెధవగోల భరించలేకుండా వున్నా. ఎరక్కపోయి అద్దె కిచ్చాం. ముప్పొద్దులా గింయ్‌మని ఏమిటీ గోలా?" అంటే 'పోనిద్దూ మనకెందుకు? ఐనా యిదేం ఛండాలం పాట గనకనా? చక్కగా పాడుతున్నారు. మనకుమాత్రం యిలాంటి అదృ ష్టం వుండొద్దూ?"-ఇదీ నే నన్నమాట. దాంతో నర్సమ్మ (అదే లక్ష్మినర్సమ్మ) నామీద విరుచుకు పడింది: "అవును, మీకు పైవాళ్ళపాటలు బాగుం డవూ? నా పాటంటే మీ కసహ్యంగాని. మీ కిష్ట మైతే వాళ్లూమీరూకలిసి"-అంతటితో నేనుఆపు చేయించాను. "లక్ష్మి, అసలే నీ నోటికి వేరే లౌడ్‌స్పీకరు అక్కర్లేదు. వా ళ్లెవరేనా వింటే బాగుండదు" అన్నాను.

"అవును, ఎందుకు బాగుంటుంది? వాళ్ళం దరూ మీ కాప్తబంధువులు. ఆ సంగీతంమేష్టరు మీకు నారదుడు. పంకజం మీకు సాక్షాత్ సరస్వతి. నేనేగా మాలకాకిని!" నిజంగా అప్పుడు లక్ష్మి చెప్పినమాట అక్షరాలా నిజం? పైకంటే ఏడుస్తుంది.

"లక్ష్మి, నువ్వు మాత్రం బాగా పాడవా? నిజంగా కోయిలవే!" అన్నాను. లక్ష్మి మరింత పెద్ద కంఠంతో-

"కోయిల నెందుకౌతానూ? ... ఎందుకండీ యీ ముఖస్తుతులు... ఇంతకీ అందరూ బాగుం దన్న నా పాట మీకు బాగుండకపోడం నా

పూర్వజన్మ పూజాఫలం." సరిగ్గా అదే సమయానికి "తొలి నే చేసిన పూజాఫలము" అని మా పక్కవాటా ఆయన పాడుతున్నాడు. ఆ మాటలు లక్ష్మి భరించలేక పోయింది- సరాసరి వెళ్ళి పచ్చడి చేస్తున్న మేష్టారి చెల్లెలు వెంకమ్మమీద వెళ్ళి పడింది.

"మగాళ్ళకి బుద్ధి లేకపోతే ఆడాళ్ళ చెప్పొద్దూ? అతనికి మాత్రం అక్క చెల్లెళ్ళు లేరూ? నన్ను వెక్కిరిస్తాడా?..." వెంకమ్మ మాత్రం తక్కువదా? చీర నడుంలోకి దోపి-

"ఇల్లిచ్చానని నోటికొచ్చినట్టు పేలను అమ్మడూ ... వాడిమటుకు వాడు పాడుకుంటూంటే నీకెందుకూ?" అంది.

వాళ్ళిద్దరి దెబ్బలాటా చూసి తీరాల్సిందే గాని చెప్పడానికి వీలులేదు. అవతల్నుంచి సంగీతం మేష్టరూ, యివతల్నుంచి నేనూ యిద్దరం వెళ్ళి వాళ్ళను విడదీశాం.

అంతే, ఆవాళనుంచీ ఆ విడకూ మా లక్ష్మికీ మాటలు లేవు. మరోనాడు మా లక్ష్మి పంకజంతో కూడా గట్టిగా దెబ్బలాడేసింది. అసూయ వుంటే ఎన్నాళ్లు దాగుతుందీ?

"ఆ మొగాడు మహా పెద్దమనిషి కాబట్టి ఆ గయ్యాళితో కాపురం చేస్తున్నాడు గాని యింకోడైతేనా!..." అనేవారందరూ. పోనీ, యీ దెబ్బలాటలు లేకుండా యింట్లో వాళ్ళను పొమ్మందామా అంటే, అసలే ఈ అద్దె డబ్బులతోనేగాని మా జీవితం వెళ్ళడం లేదు. అయినా యీ రోజుల్లో వెళ్ళమంటే మాత్రం అద్దెవాళ్లు కదులుతారు గనుకనా?

అవతల ఆ సంగీతం మేష్టారూ, యివతల యీ ప్లీడరుగారూ ఏం కూడబలుక్కున్నారో మాకు తెలీదు. ప్రతీ ముక్కలోనూ మమ్మల్ని పెట్టి ఏడిపించడం మొదలెట్టేరు. మా లక్ష్మి ఓ నాడు మల్లిపూలు తెమ్మంది. నేను మరిచిపోయాను. రాగానే "తెస్తారని ఎంతో సరదా బడ్డాను. ఛీ- యీ మొగాళ్ళని నమ్మకూడదు" అంది. ఎక్కడ విందో యీ మాట, పంకజం గట్టిగా "మగవారి నిలా నమ్మరాదే చెలీ" అని మొదలెట్టింది. లక్ష్మి ఏంచెయ్యలేక ఏడ్చుకుంది.

మరోనాడు నేను నైట్‌డ్యూటీకి వెడుతూంటే మా లక్ష్మి అడ్డుపడి "ఏమండీ, అమావాస్య రాత్రులు, నాకు భయంగా వుంటుంది. నన్ను విడిచి కదలకండి" అంది. వెంటనే పక్కవాటాలోంచి-

"నన్నూ విడచీ, కదలుకురా" అని పాట!

మర్నాడు నేను "లక్ష్మీ, నువ్వు చాలా చక్కగా వుంటావు సుమీ" అన్నాను. వెంటనే పక్కని పంకజం అందుకుంది.

"మాడ చక్కని చిన్నదీ, మా పక్క గదిలో వున్నది..."

ఇలాగే మేము పాలు తాగుతే "ఆరగింపవే, పాలారగింపవే!" అనీ, నేను లక్ష్మిని ఎందుకేనా బతిమాలితే "కోపమేల లక్ష్మీ, దయచూడవేల నాపై" అనీ యిలా ఏ పనిచేస్తే ఆపనిమీద పాట పాడేవారు.

మేము ఎంత మెల్లిగా మాట్లాడుకున్నా వినపడక మానదు, ఏపని చేస్తున్నా కనపడకా మానదు; తరువాత వాళ్ళు పాడకా మానరు. ఎలాగ?

ఇలా కాదని నేను మా మేనేజరుదగ్గిర నూరు రూపాయలు అప్పుతెచ్చి ప్లీడరుగారి చేతిలో ఒక ఏభై, సంగీతం మేష్టారు చేతిలో ఒక ఏభై పెట్టి యిల్లు మార్చుకుంటామని వాపోయించుకున్నాను. ఆ మర్నాడే వాళ్లు యిల్లు మారుతామన్నారు. ఆనాడు నేనూ మా లక్ష్మి పొందిన ఆనందం యింతాఅంతా కాదు.

అద్దె వాటాలు పోతే పోయాయిగాని యీ వెధవ గొడవ యిక పడలేను. వాళ్లు రాత్రే యిల్లు మార్చుకుంటామన్నారు. తెల్లారింది. సిగరెట్ కాల్చుకోడానికి అగ్గిపెట్టె కనబడలేదు. నాకు విసుగెత్తి "అగ్గిపెట్టె ఎక్కడ పెట్టావు, నేను ఎక్కడని వెతకను?" అన్నాను. వెంటనే పక్కవాటాలోంచి "ఎందూ వెతకుదురా, శ్రీహరి నిన్ ఎందూ..." అని మేష్టారు మొదలెట్టేడు. అయితే వీళ్లు వెళ్లలేదూ? నాకు ఒళ్లు మండింది. తిన్నగా వెళ్లి "ఏమండీ, నిన్న యిల్లు మారుతామన్నారే, మారలేదేం!" అన్నాను గట్టిగా. "అయ్యో మారకేం? ప్లీడరుగారింట్లోకి నేనూ, మా యింట్లోకి ప్లీడరుగారూ మారేం కదండీ." అన్నాడు. నేను తెల్ల మొహం వేశాను.

మరునాడు మావాటాకూడా అద్దెకిచ్చి నేనూ లక్ష్మి మరోయింట్లోకి మారేం.